క్లుప్తంగా

వ్యవసాయశాఖ మంత్రిని కలిసిన ప్రభుత్వ విప్



మంత్రి తుమ్మలతో విప్ అడ్లూరి తదితరులు

గొల్లపల్లి: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రుణమాఫీ, ఇతర సమస్యలపై మంత్రితో చర్చించారు.

సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పడాలని డీసీఎమ్మెస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురి సహకార సంఘంలో శనివారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం లావాదేవీలు, ఆస్తి, హక్కుల గురించి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సంఘంలో తక్కువ వడ్డీతో రైతులు రుణాలు పొందవచ్చని, అవసరమైన వారు తమ పాసు బుక్కులతో రావాలని కోరారు. డైరెక్టర్లు ఎల్లాగౌడ్, లింగన్న, జాజాల లక్ష్మి, దాసరి రత్న, అశోక్, సీఈవో అయ్యోరి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన




అవగాహన కల్పిస్తున్న అధికారులు, విద్యార్థినులు

కథలాపూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం వ్యవసాయ కళాశాల విద్యార్థినుల ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం వేళ సిరికొండ గ్రామంలో వివిధ రకాల పంటలు, ప్రభుత్వ భవనాలు పరిశీలించి వాటి పనితీరుపై అధ్యయనం చేశారు. అనంతరం రైతు వేదికలో రైతులతో సమావేశం నిర్వహించి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏఈవో సంధ్య, మేఘన, స్వప్న, కావ్య, కిరణ్మయి, శ్వేత, రైతులు ఏనుగు గంగారెడ్డి, తిరుమల్‌రెడ్డి, అచ్యుత్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై 91 అభ్యంతరాలు

కథలాపూర్: మండలంలో పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితాపై అభ్యంతరాలకు శనివారంతో గడువు ముగియగా, 91 అభ్యంతరాలు వచ్చినట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. మండలంలో 19 గ్రామాలుండగా 19 సర్పంచ్ స్థానాలతోపాటు 188 వార్డులున్నాయి. 37,307 మంది ఓటర్లున్నారు. ఓటరు జాబితాలను బీఎల్వోలు వార్డులవారీగా విభజించి అభ్యంతరాలు స్వీకరించారు. అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరించామని, త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఎంపీడీవో, ఎంపీవో రాజశేఖర్ శనివారం సాయంత్రం పర్యటించి ఓటరు జాబితాలపై వివరాలు సేకరించారు.

టేకుచెట్ల నరికివేత



దుండగులు నరికివేసిన టేకుచెట్లు

రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఆవరణలో టేకు చెట్లను కొద్దిరోజులుగా దుండగులు నరికివేస్తున్నారు. అటవీశాఖ అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికే 15 చెట్లు నరికివేశారని, వాటి విలువ రూ.50వేల వరకు ఉంటుందని, అధికారులు స్పందించి చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంచాయతీ సిబ్బందికి ఆర్థికసాయం

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ తండా గ్రామపంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న అరిగడ్డి రాజేశ్ అనారోగ్యానికి గురికాగా.. మండలంలోని కార్యదర్శులు కలిసి రూ.20 వేలు ఆర్థికసాయం శనివారం అందించారు. రాజేశ్ జ్వరంతో అస్వస్థతకు గురయ్యాడు. సుమారు రూ.2 లక్షల వరకు ఆసుపత్రిలో ఖర్చు అయినట్లు బాధితుడు తెలిపాడు. కార్యక్రమంలో ఎంపీవో చంద్రశేఖర్, కార్యదర్శులు నిరోష, విజయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల: నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి, శ్రావణి



కోరుట్ల: నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ లావణ్య, నాయకులు

బాపూజీ ఆశయాలను కొనసాగించాలి

జగిత్యాల/కోరుట్ల/మెట్‌పల్లి/రాయికల్/పెగడపల్లి: బాపూజీ ఆశయాలను కొనసాగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, బీజేపీ కార్యవర్గ సభ్యురాలు శ్రావణి అన్నారు. శనివారం కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా జగిత్యాలలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కౌన్సిలర్లు, పద్మశాలీ సేవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

- కోరుట్ల పట్టణంలోని కార్గిల్‌చౌక్ వద్ద బాపూజీ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ బట్టు తిరుపతి, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గుంటుక ప్రసాద్ తదితరులు నివాళి అర్పించారు.
- మెట్‌పల్లి పట్టణంలో పాత బస్టాండ్ వద్ద లక్ష్మణ్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, పద్మశాలీ సంఘం పట్టణాధ్యక్షుడు ద్యావనపల్లి రాజారాం తదితరులు నివాళులర్పించారు.
- పెగడపల్లి మండల కేంద్రంలో పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో బాపూజీ చిత్రపటానికి నివాళి అర్పించారు. మండల అధ్యక్షుడు గాజుల గంగమల్లేశం, నాయకులు పాల్గొన్నారు.
- రాయికల్ పట్టణంతో పాటు ఇటిక్యాలలో పద్మశాలీ సేవ సంఘం ఆధ్వర్యంలో బాపూజీ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు తాటిపాముల విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



రాయికల్: ఇటిక్యాలలో నివాళి అర్పిస్తున్న పద్మశాలీలు



మెట్‌పల్లి: నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మపురి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధర్మపురి పట్టణంలోని గోదావరికి వెళ్లే అంతర్గత రహదారి అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై లక్ష్మీనృసింహుని శోభాయాత్ర నిర్వహించడంతో పాటు ఆటోలు, ద్విచక్ర వాహనాలతో గోదావరినదికి వెళ్తుంటారు. రహదారిపై గుంతలు పడడంతో కాలి నడకన సైతం వెళ్లడం కష్టంగా మారింది. ఈ దారిని సీసీ రోడ్డుగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.



ఈ సమస్యపై సంప్రదించాల్సిన అధికారి
గంగాధర్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్, సెల్ నం: 78936 26388

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 94400 61630, 9705346643

పరిసరాల శుభ్రతపై దృష్టి సారించాలి

రాయికల్: పరిసరాల శుభ్రతతోనే వ్యాధుల నియంత్రణ సాధ్యమని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. రాయికల్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ఓ బాలుడు డెంగీతో మృతిచెందగా శనివారం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిల్వ ఉన్న నీటిలో అయిల్‌బాల్స్ వేయాలని సూచించారు. మండలంలోని అల్లీపూర్‌లో పల్లెదవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల పట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట హెచ్‌ఈ సత్యనారాయణ, హెచ్‌ఈవో సాగర్‌రావు, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఇల్లేందుల శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ కడకుంట్ల భూమయ్య పాల్గొన్నారు.



ఇందిరానగర్ కాలనీలో మురికికాలువను పరిశీలిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

సమష్టి కృషితో సభ్యత్వ నమోదు చేయించాలి

మల్యాల: సమష్టిగా కష్టపడి నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వ నమోదు చేయించాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మల్యాలలో అత్యధికంగా సభ్యత్వ నమోదు చేపట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్‌కుమార్, పెరక శ్రావణ్, గుగ్గిళ్ల రమేశ్, వాసాల రమేశ్, గాజుల మల్లేశం, కెల్లెటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాల: తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించిన వారిపై చర్యలు తీసుకోవాలని భారత సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని, ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కాశీనాథం, సత్యనారాయణ, శ్రీనివాస్, రాములు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

మోడల్ స్కూల్‌లో అంతా కొత్త ఉపాధ్యాయులే

కోరుట్లరూరల్: మండలంలోని కల్లూర్ మోడల్ స్కూల్‌లో అందరూ కొత్త ఉపాధ్యాయులే శనివారం బాధ్యతలు స్వీకరించారు. 11 ఏళ్లుగా పని చేసిన టీచర్లు బదిలీపై వెళ్లడంతో వారి స్థానంలో కొత్త వారు వచ్చారు. తెలుగు ఉపాధ్యాయుడు బి.మోహన్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కల్లూర్ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్ తెలిపారు. పీజీటీ ఫిజిక్స్, పీజీటీ ఇంగ్లిష్, పీజీటీ సివిక్స్, టీజీటీ మ్యాథ్స్, టీజీటీ హిందీ పోస్టులను గంటల ప్రాతిపదికన భర్తీ చేస్తామన్నారు. అర్హత గలవారు ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో ఈ నెల 24న ఉదయం 10 గంటలకు పాఠశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

సంక్షిప్త వార్తలు

● సంకష్టహర చతుర్థి వేడుకలు

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం పొలాస శివారులోని సహస్త్ర లింగాల ఆలయంలో శనివారం సంకష్టహర చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● జీవో విడుదలపై హర్షం

కోరుట్లరూరల్: రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం జీవో విడుదల చేయడంపై ఐతార్ ఎన్నారైలు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన ఎన్నారై ముహమ్మద్ నసీర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

మేడిపల్లి: మండల కేంద్రంలోని పోతు దేవక్కకు రూ.31వేలు, మకిలి సుగుణకు రూ.40వేలు, గారికర్ రేఖకు రూ.49వేల విలువ గల సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

● మెరుగైన వైద్య సేవలందించాలని వినతి

రాయికల్: పట్టణంలో నెల రోజులుగా విష జ్వరాలు ప్రబలుతున్నాయని, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని శనివారం బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ శశికాంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్‌కుమార్, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

● గర్భిణులకు సీమంతం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు.

● పోషణ మాసోత్సవాలు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని ఆత్మకూర్, పాటిమీద తండా గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్యలక్ష్మి పథకం ప్రాముఖ్యతను వివరించారు.

● ఉపాధ్యాయులకు సన్మానం

వెల్గటూర్: మండలంలోని పాశిగామ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం యాదలక్ష్మి, టీచర్ చంద్రకళను గ్రామస్తులు సన్మానించారు.

● పెరటి కోళ్ల పెంపకం లాభదాయకం

గొల్లపల్లి: పెరటి కోళ్ల పెంపకం మహిళల ఆర్థిక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతుందని గొల్లపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో శ్రీసాయి మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు.

● పోలింగ్ స్టేషన్లలో వసతులు కల్పించాలి

జగిత్యాలరూరల్: జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు అన్ని రకాల వసతులుండేలా చూడాలని ఎంపీడీవో రమాదేవి అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్లలో పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు.

● సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్లరూరల్: అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం మహిళలు, బాలింతలు, చిన్న పిల్లలు, గర్భిణులకు కల్పిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీవో కృపాకర్, ఏపీఎం శంకర్, సీడీపీవో మణెమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, భారతి, హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

● జీవోపై పునరాలోచించాలి

జగిత్యాల: ఉపాధ్యాయుల సర్దుబాటు జీవోపై పునరాలోచించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తులసి ఆగమయ్య అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, విద్యారంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

● 'గాయత్రి' సేవలు అభినందనీయం

ధర్మపురి: గాయత్రి బ్యాంకు సేవలు అభినందనీయమని సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. ధర్మపురిలోని గాయత్రి బ్యాంకులో మేనేజర్ వొజ్జల మోహన్ ఆధ్వర్యంలో చెక్కు పంపిణీ చేశారు. ఇటీవల బ్యాంకు ఖాతాదారుడు గాజుల రమేశ్ ప్రమాదవశాత్తు మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులకు రూ. 1లక్ష ప్రమాద బీమా చెక్కును సీఐ చేతుల మీదుగా అందజేశారు.

కానిస్టేబుల్ మృతి బాధాకరం



రమణ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: కానిస్టేబుల్ మృతి బాధాకరమని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. కంట్రోల్ రూమ్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన వి.రమణ శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. శనివారం రమణ మృతదేహానికి ఎస్పీ నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎస్పీ వెంట ఐటీకోర్ సీఐ రఫీక్‌ఖాన్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వెల్గటూర్: పెగడపల్లి మండలం దీకొండ గ్రామానికి చెందిన గోపులాపురం గోపాల్, ఏడుమోటలపల్లి గ్రామానికి చెందిన రాచర్ల శంకర్ స్నేహితులు. పని నిమిత్తం ఎండపల్లి వైపు వెళ్తుండగా చెర్లపల్లి వద్ద ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

మందుబాబులకు జైలు

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకెళ్లడం తప్పదని ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం అన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ కొడిమ్యాల మండలం పూడూరుకు చెందిన వడ్లకొండ నాగభూషణం, మెట్‌పల్లికి చెందిన గుండేటి మధుసూదన్ పట్టుబడగా వారిని శనివారం కోర్టులో ప్రవేశపెట్టారు. స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గంప కరుణాకర్ ఒక్కొక్కరికి నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలను నివారించేందుకు పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధర్మపురి: మండలంలోని మగ్గిడి ఆదర్శ గురుకుల పాఠశాలలో గంటల ప్రాతిపదికన బోధించుటకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 లోపు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 25న ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు. సైన్స్, సోషల్, ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సివిక్స్, కామర్స్, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో బోధించే అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని జగిత్యాల టౌన్–1 సెక్షన్ పరిధిలోని ఫీడర్ ఛానల్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ రాజిరెడ్డి తెలిపారు. టౌన్–1 పరిధిలోని కొత్తబస్టాండ్ ప్రాంతం, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఏరియా, రాంబజార్ నుంచి టవర్‌సర్కిల్ వరకు, పురాణిపేట నుంచి ఎల్జీరామ్ లాడ్జీ బ్యాక్‌సైడ్, శ్రీరాంనగర్ ఏరియాల్లో సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జగిత్యాల రూరల్ పరిధిలో..

జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల సబ్‌స్టేషన్ పరిధిలో సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల దృష్ట్యా ఆదివారం మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు. పొరండ్ల, బాలపల్లి, కన్నాపూర్, కండ్లపల్లి, హన్మాజీపేట, పెర్కపల్లి, కట్టెల మిల్లులు, మోడల్‌స్కూల్ ఎస్కేప్ ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



కళాశాలలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ మోహన్

జగిత్యాల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ, విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా బాధ్యత తీసుకోవాలని, శ్రమదానం చేయాలని సూచించారు. అనంతరం కళాశాలలో పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలియా మక్సూద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతిరెడ్డి, అధ్యాపకులు తిరుపతి, రిజ్వానా, సునీత తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

మెట్‌పల్లి: ఇంట్లో చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేయవద్దని కమిషనర్ మోహన్ సూచించారు. పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తడి, పొడి చెత్తను వేరుగా చేసి ఇళ్ల వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని పేర్కొన్నారు. అలాగే ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతకు మున్సిపల్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విష్ణు, ముజీబ్, అశోక్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛతపై విద్యార్థుల ప్రతిజ్ఞ

రాయికల్: పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ మేనేజర్ వెంకట్, మెప్మా సీవో శరణ్య, ప్రధానోపాధ్యాయుడు శ్రీపతి రాఘవులు, ఎన్‌సీసీ అధికారి పొన్నం రమేశ్, పీఈటీ పారపల్లి గంగాధర్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

కోరుట్ల: పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దరి చేరవని 16వ వార్డు కౌన్సిలర్ బలిజ పద్మరాజరెడ్డి అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో శనివారం పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, జవాన్ రాజ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. తడి, పొడి చెత్త వేరుచేయడం, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.



డ్రైనేజీలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్‌మండలం చల్‌గల్ జెడ్పీహెచ్ పాఠశాలకు చెందిన 27 మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం లలితాదేవి తెలిపారు. ఈనెల 24 నుంచి 28 వరకు జరగనున్న పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను శనివారం పీడీ వెంకటలక్ష్మి, పాఠశాల చైర్మన్ సుకన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

మేడిపల్లి మండలంలో..

మేడిపల్లి: జిల్లా కేంద్రంలో ఈనెల 24న జరిగే జిల్లాస్థాయి క్రీడాపోటీలకు మండలంలోని కొండాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన మహర్షిణి, మౌనిక, వైష్ణవి, మేఘన, మహత, లోకేశ్, పవన్, అశ్రీత, సిద్ధార్థ, శరణ్య, త్రివేణి, పార్థసారధి, నిషాంత్, విష్ణువర్ధన్, శ్రీజ తదితరులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం సత్తార్ ఖలీద్, వ్యాయమ ఉపాధ్యాయుడు దయాకర్ తెలిపారు.



జగిత్యాల రూరల్: విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీ

రాయికల్ మండలంలో..

రాయికల్: మండలంలోని రామాజీపేట జెడ్పీ పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వాలీబాల్, కబడీ, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగాల్లో ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం నరేందర్ అభినందించారు.

వర్షంతో తడిచిన మొక్కజొన్నలు

ఇబ్రహీంపట్నం: మండలంలో శనివారం అకాల వర్షం కురిసింది. దీంతో రైతులు రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నలు తడిచిపోయాయి. అకస్మాత్తుగా వర్షం కురవడంతో రైతులు టార్పాలిన్‌లు కప్పలేకపోయారు. దీంతో మక్కలు తడిచి నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. అధికారులు పరిశీలించి ఆదుకోవాలని కోరుతున్నారు.



'నిందితులను ఉరితీయాలి'

రాయికల్: ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో ఆదివాసీ మహిళపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను వెంటనే ఉరితీయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆత్రం రవీందర్ డిమాండ్ చేశారు. శనివారం తహసీల్ కార్యాలయంలో ఉద్యోగులకు వినతిపత్రం సమర్పించారు.